క్లుప్తంగా

'ఉపాధి' పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు సరైన వేతనం చెల్లించాలని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మాలకుంటలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులను పరిశీలించారు. అనంతరం ఆమె కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఉన్నారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలోని ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరిప్రియ ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కుమారస్వామి, సర్పంచ్ అమరాసేనారెడ్డి, ఏఎన్ఎమ్ రమ్య, ఆశ కార్యకర్త పద్మ తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపును తొలగించాలి



నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని బొమ్మారం గ్రామంలో గాంధీ చౌరస్తాలో ఉన్న చేతిపంపు వృథాగా మారింది. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో చేతిపంపు నుంచి చుక్కనీరు రావడం లేదు. అయినా పంపును తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. ఏళ్ల తరబడి వినియోగించకపోవడంతో సగం మేర మట్టిలో కూరుకుపోయింది. అధికారులు స్పందించి, నిరుపయోగంగా ఉన్న చేతిపంపును తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాల్ లీకేజీతో తాగునీరు వృథా



వృథాగా పోతున్న తాగునీరు

అల్లాదుర్గం(మెదక్): మిషన్ భగీరథ పైపు పగిలి వరదను తలపించిన నీటి ప్రవాహం. అదే మిషన్ భగీరథ పథకానికి చెందిన వాల్ లీకేజీతో రోడ్డుపై నీరు ప్రవహించింది. ఈ సంఘటన మండలంలోని చిల్వెర ఐబీ చౌరస్తాలో సోమవారం చోటు చేసుకుంది. చిల్వెర గ్రామ శివారులో పైపు పగిలి నీటి ప్రవాహంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మరమ్మతు పనులు పూర్తికాక ముందే చిల్వెర ఐబీ చౌరస్తాలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు చెందిన వాల్ లీకేజీతో తాగునీరు రోడ్డుపై వృథాగా పోతోంది.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు



సీమంతం నిర్వహించిన వైస్ ఎంపీపీ సుజాత, తదితరులు

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని సంకాపూర్, సంకాపూర్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎంపీపీ ఉపాధ్యక్షురాలు సుజాత సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలో సీమంతాలు కార్యక్రమంతో పాటు చిన్నారికి అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, తండా సర్పంచ్ భూలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మి, గాయత్రి, ఉప సర్పంచ్ లాల్‌సింగ్, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

'నష్టపరిహారం చెల్లించండి'

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్రూంలు ఇస్తామని ఇవ్వలేదని, నష్టపరిహారం చెల్లించాలని మనోహరాబాద్‌కు చెందిన పలువురు గడా ప్రత్యేక అధికారి ముత్యం రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎండలోనే రోగులకు వైద్యం

- అవస్థలు పడుతున్న జనం
- రంగంపేట పీహెచ్‌సీ దుస్థితిపై కథనం



ఎండలో రోగులకు వైద్య సేవలు చేస్తున్న సిబ్బంది

కొల్చారం(నర్సాపూర్): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండు దశాబ్దాలకే శిథిలావస్థకు చేరుకుంది. ఏమాత్రం వైద్య సేవలకు అనుకూలంగా లేని భవనం స్థానంలో నూతన భవనం నిర్మించకుండా.. మరమ్మతులకే మొగ్గు చూపుతున్నారు. ఇదీ కొల్చారం మండలంలోని రంగంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుస్థితి.

- మండలంలోని రంగంపేట గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎనిమిది గ్రామాల ప్రజలకు వైద్య సేవలను అందిస్తోంది. ఆరోగ్య కేంద్రం మొదట్లో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. భవనం శిథిలావస్థకు చేరుకోవడం, ప్రస్తుతం ఆస్పత్రిలో సాధారణ కాన్పులు కూడా చేయలేని పరిస్థితి మధ్య కొట్టుమిట్టాడుతోంది.
- రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ సమయంలో నాణ్యత లేని పనులతో రెండు దశాబ్దాలకే పూర్తి శిథిలావస్థకు చేరుకొని వైద్య సేవలకు ఏమాత్రం అనుకూలంగా లేని పరిస్థితులు ఐదేళ్ల నుంచి కనిపిస్తున్నాయి.
- భవనం స్లాబు పైకప్పు పూర్తిగా దెబ్బతిని వర్ష కాలం స్లాబు లోపలి నుంచి నీరు కారుతుండడంతో భవనం లోపలి పైకప్పు ఎక్కడికక్కడ పెచ్చులూడి ఊచలు తేలి కనిపిస్తున్నాయి. రోగులను కనీసం బెడ్లపై పడుకోబెట్టి వైద్యం చేయని పరిస్థితి. గోడలు సైతం బీటలు వారి భవనం ఏ క్షణంలోనైనా కూలడానికి సిద్ధంగా ఉంది.
- నాలుగేళ్ల క్రితం జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి స్వయంగా ఆస్పత్రిని సందర్శించి, నూతన భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు కూడా పంపారు.
- స్వయంగా ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు నూతన భవన నిర్మాణానికి రూ. కోటి ప్రతిపాదనలతో నిధులు మంజూరయ్యాయని కూడా స్వయంగా మండలంలో జరిగిన సమావేశంలో పలు సందర్భాల్లో చెప్పారు.
- ఆ ప్రతిపాదనలను దాఖలు చేస్తూ రిపేర్ కంటూ పంచాయతీరాజ్ నిధుల కింద రూ.22 లక్షలు కేటాయిస్తూ టెండర్ పనులు పూర్తిచేసి, కాంట్రాక్టర్‌కు పనులు కూడా అప్పగించారు.
- పనులను పొందిన కాంట్రాక్టర్ మాత్రం స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం కాకుండానే, ఆస్పత్రి నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే ఏకపక్ష నిర్ణయంతో భవనంలోని అన్ని రూములను ఖాళీ చేయించాడు. దీంతో పక్కనే ఉన్న రేకుల షెడ్‌లో బెడ్లు వేసి, ఆస్పత్రి ఆరుబయట వైద్యులు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.
- వైద్యం కోసం వచ్చే రోగులు ఎండ వేడిమికి తట్టుకోలేక విలవిల్లాడుతున్నారు.
- విలువైన మందులను సురక్షిత ప్రదేశంలో భద్రపరచాల్సి ఉన్న ఇవేమీ పట్టించుకోకుండా ఏమాత్రం సురక్షితంగా లేని రేకుల షెడ్డులోకి మార్చారు.రింది.



రేకుల షెడ్డులో రోగులు

- రోగులకు కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయలేదు.
- వైద్య సేవల కోసం వచ్చిన రోగులు ఎండ తాపానికి తట్టుకోవడం లేదన్న విషయమై ఆస్పత్రి వైద్యురాలును వివరణ కోరగా.. రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు.

ఇంత దారుణమా..?



దవాఖానాకు రిపేర్లు చేస్తున్నామని చెప్పి ఎండలో నిలబెట్టి వైద్యం చేస్తున్నారు. మొన్నటి వరకు పెచ్చులూడి పడుతున్నాయని దవాఖానాకు వచ్చేందుకు భయపడ్డాం. ఇప్పుడేమో ఆరు బయట దవాఖానా నడుపుతున్నారు. ఎండవేడిమికి తట్టుకోలేకపోతున్నాం.

– సురేష్, రోగి, సంగాయిపేట గిరిజన తండా

పాత దానికే పూతలా ..



ఆస్పత్రి శిథిలావస్థకు చేరింది. నూతన భవనానికి కోట్ల రూపాయలు మంజూరు చేశాం. త్వరలోనే కొత్త భవన నిర్మాణం పనులు సాగుతాయని గొప్పలు చెప్పిన ప్రజాప్రతినిధులు కూలడానికి సిద్ధంగా ఉన్న పాత భవనానికే పూతలు వేయడానికే మొగ్గు చూపడం సరికాదు.

– గంగారాం, విశ్రాంత ఉద్యోగి, రంగంపేట

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న మహిళలు, బీజేపీ నాయకులు

రామాయంపేట(మెదక్): అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మహిళలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఇటీవల 250 మందికి ఇళ్లు మంజూరు చేశారని, ఇంకా చాలా మంది అర్హులు మిగిలి పోయారన్నారు. అత్యంత నిరుపేద స్థితిలో ఉన్న వారికి ఇళ్లు మంజూరు కాలేదని, దీంతో వారు పూరి గుడిసెల్లో, అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారన్నారు. ఇకనైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, అర్హులకు న్యాయం చేయాలని శంకర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు డిప్యూటీ తహసీల్దార్ స్వప్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త అంత్యక్రియల్లో ఎమ్మెల్యే



పాడె మోస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీజేపీ కార్యకర్త అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు పాడె మోశారు. ఆదివారం రాత్రి చిన్నశంకరంపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పొలంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త సతీష్‌గౌడ్ (24)మృతి చెందాడు. సోమవారం పొలంపల్లి గ్రామంలో సతీష్‌గౌడ్ అంత్యక్రియలు నిర్వహించగా, ఎమ్మెల్యే కార్యకర్త పాడే మోశాడు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండలాధ్యక్షుడు భూపాల్, నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్, చిన్నశంకరంపేట, నార్సింగి, మాసాయిపేట మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజం కోసం పనిచేసే జర్నలిస్టులకే గుర్తింపు

రామాయంపేట(మెదక్): కొందరి వైఖరితో నేడు మీడియాలో విచ్చలవిడితనం పెరిగిపోయిందని, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఐజేయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ అన్నారు. సోమవారం రామాయంపేటలో జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. జర్నలిజాన్ని నాశనం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. సమాజం, ప్రజల కోసం పనిచేస్తున్న విలేకరులనే ప్రజలు గుర్తిస్తారని, అక్రమ సంపాదనకు మార్గంగా ఎంచుకునే వారిని ప్రోత్సహించొద్దని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం విషయమై రామాయంపేట కేంద్రంగా గతంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించామని గుర్తుచేశారు.



మాట్లాడుతున్న విరాహత్ అలీ

సోషల్ మీడియా పేరుతో ధనార్జనే ధ్యేయంగా కొందరు మన వృత్తికే కళంకం తెస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్‌చారి, శ్రీనివాసశర్మ, నాగరాజు, అశోక్, కంది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విజ్ఞాన జ్యోతిలో సిరిధాన్యాలపై అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల18న మండలంలోని తునికివద్ద గల డాక్టర్ డీ.రామానాయుడు విజ్ఞాన జ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యా సంస్థ, వ్యవసాయ కళాశాలలో సిరిధాన్యాలపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు డైరెక్టర్ అర్జున్‌వార్, ఫీల్డ్ సూపర్‌వైజర్ జగదీష్ సోమవారం తెలిపారు. రైతునేస్తం ఫౌండేషన్ సహకారంతో ఈనెల18న ఉదయం 8 నుంచి 10గంటల వరకు రైతులకు సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంపై శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. దేశీ ఆహార పదార్థాలు సిరిధాన్యాల సాగుతో పాటు సాగులో కషాయల వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రమాదకర వంతెన.. ప్రజలకు ఇక్కట్లు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మెల్లూర్ నుంచి కొప్పులపల్లి వైపు వెళ్లే దారిలో ఉన్న వంతెనపై సైడ్ వాల్స్ నిర్మించలేదు. దీంతో ఇరుపక్కల ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారి నుంచి మూలమలుపులో ఉన్న వంతెనపై ఆదమరిస్తే వాహనదారులు ప్రమాదానికి గురై కాలువలో పడే పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో అధికారులు స్పందించి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న వంతెన

సంక్షిప్త వార్తలు

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని మాద్వేట్‌పల్లి గ్రామంలో రూ.30 లక్షలతో సీసీరోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మి, సర్పంచ్ రమ్య, ,గ్రామస్తులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

చేతిపంపు ప్రారంభం

టేక్మాల్(మెదక్): మండలంలోని సాలోజిపల్లి గ్రామంలో మండల పరిషత్ నిధులతో వేయించినా నూతన బోరును సోమవారం ఎంపీపీ స్వప్న ప్రారంభించారు. ఇందులో సర్పంచ్ హర్షబేగం, ఉపసర్పంచ్ దుర్గేష్, పంచాయతీ కార్యదర్శి అజ్మీర్‌మియా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భిక్షుల వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్, మాజీ సర్పంచ్ వరలక్ష్మి, సలీం, గ్రామాధ్యక్షుడు ఇర్షద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

టేక్మాల్(మెదక్): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణలో భాగంగా సోమవారం టేక్మాల్‌లోని జూనియర్ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఇందులో కార్యదర్శులు రవితేజ, అనిత, కీర్తి, జగదీష్, రాకేష్, రాజ్‌కుమార్, ప్రవీణ్, శ్రీనివాస్, ఇసాక్, అశోక్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

17జెజిపి13 నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

కొనుగోలు కేంద్రాలపై అవగాహన



పాపన్నపేట(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సోమవారం కొత్తపల్లి రైతుసేవా సహకార సంఘం చైర్మన్ రమేశ్ సోమవారం అవగాహన కల్పించారు. కొనుగోలు కేంద్రాల్లో తాలు లేకుండా ధాన్యం తీసుకోవాలని రికార్డులు రాయాల్సిన పద్ధతులు నిర్వాహకులకు వివరించారు. కార్యక్రమంలో సీఈఓ వేంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీనివాస్, వెంకటేశం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని మేనగండ్ల గ్రామంలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం సర్పంచ్ దమన్నగారి వీరారెడ్డి, ఎంపీపీ మంజులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుమలత, రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండల ముదిరాజ్ యువజన సంఘం ఎన్నిక

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ముదిరాజ్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల కేంద్రంలో సమావేశమై ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం యువజన అధ్యక్షుడిగా కోనాపూర్ రాజు, ఉపాధ్యక్షుడిగా మధు, రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రంగంపేటకు చెందిన సుధాకర్, సహాయ కార్యదర్శిగా రాంపూర్ నర్సింలు, కోశాధికారిగా అప్పాజీపల్లి యాదగిరి, ఇతర బాధ్యులుగా మహేశ్, శేఖర్, రాము, శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీహరి, అభిలాష్, సుధాకర్, సతీష్, తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా కృషి చేయాలి

ఎంపీడీఓ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో ప్రతీ ఒక్కరు మరుగుదొడ్డి వాడాలని, స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి స్వచ్ఛభారత్ మిషన్–2పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాలు, తండాల్లో సంపూర్ణ పారిశుధ్యం ఉండాలని, ఆరు బయట మలవిసర్జన చేయ్యొద్దని ప్రతీ ఒక్కరు మరుగుదొడ్డి వాడాలన్నారు. ప్రతీరోజు తడి, పొడి చెత్తను వేరుచేసి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. తడి చెత్తతో వర్మికంపోస్ట్ ఎరువు తయారు చేసి హరితహారం మొక్కలకు వాడాలన్నారు. ప్లాస్టిక్‌ను వాడొద్దని, ప్లాస్టిక్ సేకరించి రిసైక్లింగ్‌కు తరలించాలని వివరించారు. ఇంకుడు గుంతలు నిర్మించాలని, పాఠశాలల విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించాలని టాయిలెట్స్‌కు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా స్వచ్ఛభారత్ మిషన్‌పై అవగాహన కల్పించారు. ఈనెల 18న రాయిలాపూర్‌లో క్షేత్రపర్యటన నిర్వహించి, శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

సీపీఆర్‌పై శిక్షణ..

ఈ సందర్భంగా మండల వైద్యాధికారి శ్రీకాంత్ సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. గుండెపోటుకు గురైన వ్యక్తులకు వెంటనే సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలు కాపాడొచ్చని ఎలా చేయాలో చేసి చూపించారు. కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, రిసోర్స్ పర్సన్ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషి



మున్సిపల్ చైర్మన్‌కు పార్టీ స్వశక్తి అభియాన్ పత్రాలు అందిస్తున్న నాయకులు

నర్సాపూర్: ప్రతీ బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రణాళికతో కార్యక్రమాలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ చెప్పారు. సోమవారం పట్టణంలోని 277 బూత్‌లో పార్టీ కార్యక్రమంలో భాగంగా స్వశక్తి అభియాన్ కార్యక్రమం పార్టీ బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. పట్టణంలోని అన్ని బూత్‌ల్లో పార్టీ కార్యక్రమాలు పూర్తి చేస్తున్నారని అన్నారు. నాయకులు నారాయణరెడ్డి, మేఘరాజ్, రమేశ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): బూత్‌స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కాజిపేట రాకేశ్ తెలిపారు. సోమవారం మండలంలోని మనంతయపల్లి తండాలో బూత్ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఆధ్వర్యంలో గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. దీంతో పాటు స్వశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా 31 మంది బీజేపీ కార్యకర్తలతో బూత్ కమిటీలకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ అధ్యక్షుడిగా సూర్యనాయక్, సభ్యులను నియమించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కొండల్, మండల ఎస్టీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ మధు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా రామాయంపేటను ప్రకటించాలి



దీక్ష చేస్తున్న అఖిలపక్ష నాయకులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్‌గా రామాయంపేటను ప్రకటించాలని అఖిలపక్ష నాయకులు అన్నారు. రెవెన్యూ డివిజన్ సాధన కోసం రామాయంపేటలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 22వ రోజుకు చేరుకున్నాయి. ఆరెకటిక సంఘం సభ్యులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇకనైనా రెవెన్యూ డివిజన్ ప్రకటించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఈ దీక్షలు కొనసాగుతున్నాయి. యువజన సంఘాలు, కుల సంఘాల ప్రతినిధులు దీక్షలకు మద్దతు ప్రకటించారు.

విద్యుత్ మీటర్ల తనిఖీ



విద్యుత్ మీటర్లను తనిఖీ చేస్తున్న అధికారులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో విద్యుత్ శాఖ అధికారులు సోమవారం 30 బృందాలుగా ఏర్పడి గ్రామంలో విస్తృతంగా తనిఖీ చేపట్టారు. ఈ మేరకు విద్యుత్ అధికారులు మాట్లాడుతూ.. గ్రామంలోని ఇంటింటికీ ఉన్న విద్యుత్ మీటర్‌లను తనిఖీ చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి, అనధికార విద్యుత్ వినియోగం చేసినట్లయితే కేసు నమోదు చేసి, అపరాధ రుసుం వసూలు చేస్తామని విద్యుత్ అధికారులు వినియోగదారులకు హెచ్చరించారు. విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

'దేవాలయ భూములను కాపాడండి'



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో దేవాలయ భూములను భూ అక్రమణ నుంచి కాపాడాలని గ్రామస్తులు కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం మండలంలోని కాళ్లకల్ గ్రామస్తులు మెదక్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని లక్ష్మీనర్సింహ దేవాలయ భూములను కొంత మంది కబ్జా చేసి, రీ సర్వే పేరుపై అమ్మకం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని అధికారులను కోరారు. అలాగే దేవాలయ భూమి సర్వే నంబర్ 254కు సర్వే చేసి, సుమారు ఎనిమిది ఎకరాలకు హద్దులు వేయించాలని కోరారు. అనంతరం తూప్రాన్ ఆర్డీఓ శ్యాం ప్రకాష్, తహసీల్దార్ భిక్షపతిలకు సైతం వినతి పత్రాలు అందజేశారు.

రంజాన్ కానుకల అందజేత



టేక్మాల్(మెదక్): రంజాన్ కానుకలను అందిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): మండలంలోని అన్ని గ్రామాల ముస్లింలకు సోమవారం జోగిపేటలో అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ రంజాన్ కానుకలను అందజేసినట్లు పార్టీ అధ్యక్షుడు వీరప్ప తెలిపారు. రంజాన్ కానుకలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఇందులో మండల పార్టీ నాయకులు, అన్ని గ్రామల సర్పంచ్‌లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పురుగులు పట్టిన బియ్యాన్ని ఎలా తింటారు

మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): మండలంలోని దంతేపల్లి, కాట్రియాల, తదితర గ్రామాలకు పురుగులు పట్టిన రేషన్ బియ్యం పంపిణీ చేశారని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. ఆయా గ్రామాల ప్రజలు పురుగులు పట్టిన బియ్యాన్ని ఎలా తింటారని ప్రశ్నించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై అధికారి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పిల్లుట్ల ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2002 – 2003లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులైన వీరప్ప, సంజీవరావు, బసవరాజ్, నాగేందర్‌రెడ్డి, సాయిలు, వెంకట్‌స్వామి, శ్రీలత, సత్యశ్రీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కరుణాకర్‌రెడ్డి, నాగరాజు, నాగేందర్, మధు, మహేశ్, ముత్యాలు, రవి ఉన్నారు.